


మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ సాయినాథ్

ప్రజాశక్తి - కాట్రేనికోన

మహిళలు అన్ని రంగాల్లోనూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సాయినాథ్ జైచంద్ర అన్నారు. మంగళవారం కాట్రేనికోన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన ఆర్‌జిబి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఏ విధంగా జీవనోపాధి చేసుకుని జీవించాలో వివరించారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం వేదరాజు శ్రీనివాసరాజు, అకౌంటెంట్ నాగార్జున, సిసి రఘురాం, విఒఎలు, గ్రామ సంఘం లీడర్లు పాల్గొన్నారు.

భద్రత లేని బతుకులు

- విస్తరిస్తున్న గిగ్ వ్యవస్థ
- గుర్తింపునకు నోచుకోని వర్కర్లు
- వర్తించని పిఎఫ్.ఇఎస్ఐ, గ్రాడ్యుటీ, బోనస్
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

డిజిటల్ వేదికల ద్వారా వినియోగదారులకు ఆహార పదార్థాలు,మందులు, వస్తువులు తెచ్చి ఇచ్చేవారు, రవాణా సేవలు అందించేవారిని గిగ్ వర్కర్లు అంటారు. జొమోటో, స్విగ్గీ, ఉబర్, ఓలా, డూన్జీ, జెప్టో, ర్యాపిడో తదితర సంస్థల్లో పని చేస్తున్నారు. వీరికి ఆయా సంస్థలు కనీస వేతనాలు ఇవ్వరు. కార్మిక చట్టాల ప్రకారం అందించే సౌకర్యాలు అందవు. ఎటువంటి భద్రత లేకుండానే వర్కర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా సమస్యల పట్ల ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల నుంచి 3,500 వరకూ వివిధ సంస్థల్లో గిగ్ వర్కర్లు పని చేస్తున్నారు. ప్రస్తుతం నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం వలన ఉపాధి మార్గాలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కనుమరుగవుతున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో అనేకమంది స్వయం ఉపాధి మార్గాలను ఎన్నుకుంటున్నారు. గిగ్ వర్కర్లుగా సైతం పని చేస్తున్నారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వాళ్ళు సైతం ఈ రంగంలో ఉపాధి కోసం చేరుతున్నారు. ఈ నేపథ్యంలో వారి అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కార్పొరేట్ సంస్థలు గిగ్ వర్కర్ల శ్రమను దోచుకుంటున్నాయి.

కార్మికులుగా లేని గుర్తింపు

గిగ్ వర్కర్లను ఆయా కంపెనీలు అసోసియేట్ పార్టర్స్‌గా చేర్చుకుంటున్నాయి. అయితే కార్మికులుగా మాత్రం గుర్తించరు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కార్మికులుగా గనక గుర్తిస్తే ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు చెల్లించాల్సి వస్తుంది. అలాగే పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలి. పనికి తగిన బోనస్ ఇవ్వాలి. గ్రాడ్యుటి చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలి. అయితే కార్మిక చట్టాల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుంటున్న ఆయా కంపెనీలు వీరిని అసోసియేట్ పార్టర్స్‌గా పనిలో పెట్టుకున్నాయి. కంపెనీలో కార్మికులు చేస్తున్న ప్రతి పనినీ వీళ్ళతో చేయిస్తున్నారు. కొరియర్, పోస్టల్ డిపార్ట్మెంట్లలో సర్వీసు చేస్తున్న వారందరికీ కార్మిక చట్టాలు వర్తిస్తాయి. కానీ అంతకంటే ఎక్కువగా పని చేస్తున్న గిగ్ వర్క ర్లకు మాత్రం చట్టాలు వర్తించకుండా యాజమాన్యాలు మోసం చేస్తున్నాయి.

శ్రమ ఎక్కువ ఫలితం తక్కువ

వీరికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు అమలు కావటం లేదు. దానితో ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని గంధరగోళంలో బతుకుతున్నారు. రోజుకు ఎంత ఆదాయం వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఎక్కడ ఏ రకమైన దాడి జరుగుతుందో భయ బ్రాంతులతో పనిచేస్తున్నారు. కమీషన్ బేస్ ప్రకారం పని చేస్తున్నారు. వినియోగదారుడు బుకింగ్ చేసిన విలువలో కేవలం 5 నుంచి 30 శాతం మాత్రమే కమిషన్‌గా జమ చేస్తున్నారు. రవాణా రంగంలో సొంత వాహనం, సొంత ఇంధనం కలిగి ఉంటుంటే కేవలం 30 శాతం మాత్రమే సంస్థలు గిగ్ వర్కర్లకు కమిషన్‌గా అందజేస్తున్నాయి.

కమీషన్‌ను తగ్గిస్తున్న యాజమాన్యాలు

గిగ్ వ్యవస్థకు ఇటీవల ప్రాధాన్యత బాగా పెరుగుతుంది. దీంతో కమీషన్ కూడా సంస్థలు తగ్గిస్తున్నాయి. అలాగే ఆహార పదార్థాలను బుకింగ్ చేసుకుంటుంటే భారీగా ధరల వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రజలను దోచుకుంటుండగా వర్కర్లకు మాత్రం కమీషన్లను గణనీయంగా తగ్గిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యాలకు సంబంధం లేకుండా చట్టాలను వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. వర్కర్లు ప్రమాదంలో గనుక చనిపోతే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వారిని ఆదుకునే వారు ఎవరు కనిపించడం లేదు. ప్రభుత్వం కూడా వీరికి అనుకూలంగా ఎటువంటి చట్టాలు తీసుకురావడం లేదు. మరోవైపు ఆయా యాజమాన్యాలు వర్కర్లపై పోటీ తత్వాన్ని పెంచుతున్నాయి. సమయానికి వెళ్ళకపోతే కమీషన్‌లో కోత పెడుతున్నాయి. దీంతో సమయం ఒత్తిడి వర్కర్లపై విపరీతంగా పడుతుంది. కొంతమంది ఆకతాయిలు వర్కర్లపై భౌతికంగా దాడులకు దిగుతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో ఒక అపార్ట్‌మెంట్లో ఒక వర్కర్‌పై కొందరు అనుచితంగా ప్రవర్తించారు. బట్టలు విప్పి దాడి చేశారు. దీంతో సంబంధిత అపార్ట్‌మెంట్లో ఆర్డర్లు ఇచ్చేది లేదంటూ గిగ్ వర్కర్లు బాయ్ కట్ చేసిన పరిస్థితి ఉంది. ఇటువంటి ఘటనలు అనేకచోట్ల జరుగుతున్నాయి. కానీ వెలుగులోకి రావడం లేదు. కానీ యాజమాన్యాలు మాత్రం వర్కర్లకు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ విధంగా మానసిక ఒత్తిళ్లు వీరుపై పెరుగుతున్నాయి. పెట్రోల్ ధరలు పెరిగే కొద్దీ నిజ ఆదాయం తగ్గిపోతూ వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వర్కర్ల సమస్యలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్మికులుగా గుర్తించాలి



గిగ్ వర్కర్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మికులుగా గుర్తించాలి. కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలి. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడంతోపాటు బోనస్ అందించాలి. కనీస వేతనాలను అమలు చేయాలి. భౌతిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో చట్టపరమైన రక్షణ కల్పించాలి.

-సిహెచ్.రాజ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - రాజోలు

ఈ 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి కె. కృష్ణవేణి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం రాజోలు సిఐటియు ప్రజా సంఘాల కమిటీ సమావేశం అన్నపూర్ణ అధ్యక్షతన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు తీసుకుని ఈ దేశంలో యాజమాన్యాలకు బానిసలను చేస్తూ లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. వీటికి అనుకూలంగా ఈ రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపి పార్లమెంటులో మద్దతు ఇచ్చాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 48 కేంద్ర కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్ తీసుకొచ్చిందన్నారు. ఇది అమలు అయితే కార్మిక వర్గం ఉన్న హక్కులను కోల్పోతారని ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం కార్పొరేట్లకి కట్టబెడుతున్నారన్నారు. ఈ విధానాలు భవిష్యత్తులో కార్మిక వర్గం తీవ్రమైన అన్యాయం ఎదుర్కోవాల్సి వస్తుందని కాబట్టే మే 20న సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని చెప్పి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె.సుజాత ఎం.మేరీ, రమా , సుబ్బలక్ష్మి భవాని, రమాదేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ఉపాధ్యాయ ఖాళీలపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - అమలాపురం

త్వరలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీలు, పాఠశాలల్లో ఏర్పడే ఖాళీ పోస్టులపై వెరిఫికేషన్ నిమిత్తం ఒక రోజు మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. అమలాపురం మండలం సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాఠశాలల్లో క్యాడర్ స్ట్రెంగ్త్, క్లియర్ వేకెన్సీలు, రీఅపోర్షన్ వేకెన్సీలు, 5/8 సంవత్సరాల ఖాళీలు, స్టడీ లీవ్స్, మిగులు ఉపాధ్యాయుల వివరాలను ఎంఇఒలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి సేకరించారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ఐటీ సిబ్బందితో కలిసి హాజరయ్యారు. వర్కింగ్ సర్ఫ్లజ్లస్, వేకెంట్ సర్ప్లజ్లస్, క్లియర్ వేకేన్సీల కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషా సూచించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ, ఉప విద్యాశాఖాధికారులు జి.సూర్యప్రకాశరావు, పి.రామలక్ష్మణమూర్తి, డిఇఒ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టరు (సర్వీసెస్) పి.నాగేశ్వరరావు, ఐటీ సిబ్బంది, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బివివి.సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, డాక్టర్ ఎంఎకె.భీమారావు, డిఎస్ఒ జివిఎస్.సుబ్రహ్మణ్యం అధికారులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తా


ఎంపీ హరీష్ హామీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అంబేద్కర్ కోనసీమలో రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులందరికి పూర్తి నష్ట పరిహారం అందించి న్యాయం చేస్తానని అమలాపురం ఎంపి గంటి హరీష్ మాదుర్ హామీనిచ్చారు. మండలంలోని మహిపాల చెరువు గ్రామ పరిధిలో గ్రాండ్ పార్కు ఫంక్షన్ హల్ లో భూములు కోల్పోయే అయినవిల్లి, అమలాపురం రూరల్ మండలాలకు సంబంధించి భూములు కోల్పోయే రైతులు, నివాస గహాలు నష్టపోయే గృహ యజమానులతో మంగళవారం రెవెన్యూ అధికారులతో కలసి ఎంపీ హరీష్ బాధిత గ్రామాల రైతులు,ప్రజల అభిప్రాయసేకరణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపి హరీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేయాలానే కృత నిశ్చయంతో పని చేస్తుందన్నారు. దీనిలో భాగంగా మాజీ స్పీకర్, కి.శే బాలయోగి తలపెట్టిన రైల్వే లైన్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలు ఆకాంక్షను నేరవేరుస్తానన్నారు. రైల్వే లైన్ నిర్మాణానికి భూములిచ్చిన శానపల్లి లంక, తొత్తరమూడి,విలస, బట్నవిల్లి, మాగం తదితరులు గ్రామాల నుంచి భూములిచ్చి నష్టపోయామని పలువురు వచ్చిన బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేయగా అందరినీ ఆదుకుంటామని ఎంపీ హరీష్ హామీనిచ్చారు. మట్టపర్తి భాస్కర రావు మాట్లాడుతూ సారవంతమైన భూముల్లో పలురకాల పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, బహిరంగ మార్కెట్లో లక్షలు పలికే భూములకు వేలల్లో పరిహారం ఇస్తామంటే ఎలా అని,తగిన రీతిలో పరిహారం ఇప్పించాలని మొర పెట్టుకున్నారు. బొక్కా బేబీ సరోజినీ మాట్లాడుతూ ఎకరం పొలంలో 90 సెంట్లు అవసరం అని తీసుకుంటే మిగిలిన 10 సెంట్లులలో ఏం పండించుకోగలమని ప్రశ్నించారు. అలాగే నివాస గృహాలు కోల్పోతున్న వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి అవసరమైన పూర్తి పరిహారం అందించాలని కోరారు. కోటిపల్లి అమలాపురం రైల్వే లైన్ కు సంబంధించి అయినవిల్లి, అమలాపురం రూరల్ మండలాల్లో ఏడు గ్రామాలకు చెందిన 158 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించగా 2001లో రైల్వే లైన్ నిర్మాణానికి అప్పటి ఎంపి, మాజీ లోక్ సభాపతి జిఎంసి.బాలయోగి హయాంలో చర్యలు తీసుకోగా మరలా 25 సంవత్సరాల తర్వాత ఆయన తనయుడు ఎంపీ హరీష్ మాదుర్ చొరవతో భూములు కోల్పోతున్న ప్రతీ ఒక్కరికి న్యాయం చేసి, రైల్వే లైన్ ఏర్పాటుకు ముందడుగు వేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో అమలాపురం ఆర్‌డిఒ కె.మాధవి, కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్, అయినవిల్లి తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ, ముమ్మిడివరం తహశీల్దార్ ఎంవి.సుబ్బలక్ష్మి, ఎంపిడిఒ తాడి శ్రీ వెంకటాచార్య, డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణ, కల్వకొలను తాతాజీ తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి


డిఎస్‌పి రఘువీర్‌ను కలిసిన చిట్టిబాబు తదితరు లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్న%శీ% మవుతుందని ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని పట్టణవాసులు డిఎస్‌పి రఘువీర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాలింగ్ చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం డిఎస్‌పిని కలిసి పరిస్థితి వివరించారు. పట్టణంలో గల ఏరియా ఆసుపత్రికి విపరీతంగా జనం రావడంతో పాటు, ఇక్కడ గల కోర్టులు, పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ విద్యా సంస్థలు ఉండటంతో ఉదయం సాయంత్రం ట్రాఫిక్ అధికంగా ఉంటుందన్నారు. దీనికి తోడు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ భారీ వాహనాలు, లారీలు, ఆటోలు, పట్నంలోని రహదారిగుండా ప్రయాణించడంతో మరింత సమస్య ఏర్పడుతుందని, ముఖ్యంగా ఉదయం 9 నుండి 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడు తుందని వెంటనే ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని అన్నారు. బైపాస్ రోడ్డుపై వాహనాలను మళ్లించి పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రించాలని డిఎస్‌పికి అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

యువతకు సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన


ముమ్మిడివరంలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ వెంకటాచార్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గ్రామీణ ప్రాంతాల్లోని యువత సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ముమ్మిడివరం మండల అభివద్ధి అధికారి తాడి వెంకటాచార్య సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నందు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బెంగళూరు సహాయ సహకారాలతో స్వచ్ఛంద సంస్థలైన కార్లిమేట్ సిస్టర్ ఆఫ్ థెరిసా (అమలాపురం), పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ముమ్మిడివరం), సత్యం చారిటబుల్ ట్రస్ట్ (పాలకొల్లు) సంస్థల ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపిడిఒ వెంకటాచార్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని యువత అంతా కూడా సామాజిక ఆర్థిక అంశాలపై అవగాహన ఏర్పరచుకొని గ్రామీణ ప్రాంతంలో నివసించే కుటుంబాలకు ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామ సమస్యలను ఆయా సచివాలయాల దృష్టికి తీసుకువచ్చి, ప్రజలను చైతన్యవంతులు చేయవలసిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ.విమల మాట్లాడుతూ మహిళలు, బాలికల హక్కులపై యువత అవగాహన కలిగి సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇండియన్ సోషల్ ఇన్స్టిట్యూట్ బెంగళూరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ జి.కరుణారావు మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు మాడ్యూల్లో శిక్షణ ఇచ్చామన్నారు. యువతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పై అవగాహన, రాజ్యాంగం పై అవగాహన, గ్రామీణ ప్రాంతాల సమస్యలపై నేటి యువత ఏ విధంగా అవగాహన పెంచుకోవాలనే అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. నాలుగవ మాడ్యూల్ లో సమాజంలోని యువత ఏ విధంగా ఆర్థిక సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలనే శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె వెంకటేశ్వరరావు,సత్యం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎన్.సంజయ్ లతో పాటు శిక్షణకు హాజరైన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌యు ప్రొఫెసర్ త్రినాథ్‌రావుకు సత్కారం


మోడరన్ కళాశాల్లో ప్రొఫెసర్ త్రినాథరావును సత్కరిస్తున్న లయన్ జివి.రావు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం.త్రినాథ్‌రావును మోడరన్ విద్యాసంస్థలలో మంగళవారం సత్కరించారు. ఇక్కడ జరుగుతున్న ఆరవ సెమిస్టరు వైవా పరీక్షలకు ఎగ్జామినర్ ఆయన విచ్చేశారు. ఈ నేపద్యంలో మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు ఆయనను ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం జివి.రావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న ప్రొఫెసర్ త్రినాథ్ రావు మోడరన్ విద్యాసంస్థలకు ఎగ్జామినర్ గా హాజరు కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ పి.వెంకటేశ్వర్లు, సిహెచ్.రాజేష్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయనను దుస్సాలు వాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

కార్టూ'నిజం'



సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారు: వైఎస్ జగన్

ముక్కామల పిహెచ్‌సి వైద్యాధికారిగా దివ్యశ్రీ


డాక్టర్ టి.దివ్యశ్రీ

ప్రజాశక్తి - అంబాజీపేట

ముక్కామల పిహెచ్‌సి వైద్యాధికారిగా డాక్టర్ టి.దివ్య శ్రీ నియమితులై మంగళవారం బాధ్యతలు స్వీకరించారు..ఇంత వరకు ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యాధికారులు ఇంద్రావతి, గీతాంజలిలు ఉన్నత చదువులకు వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. మరో వైద్యాధికారి ఖాళీ భర్తీ కావలసిఉంది. ప్రస్తుతం ఈ ఖాళీలో అడివి పిహెచ్‌సి వైద్యాధికారి పి.రవికుమార్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దివ్యశ్రీ మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలో ప్రజలు పరిసరాల పరిశుభ్రత కి ప్రాధాన్య ఇస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని సూచించారు. పిహెచ్‌సి సిహెచ్ఒ ఎమ్.రవికుమార్, వైద్య సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగోన్నతిపై చలపతిరావు బదిలీ


ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి చలపతిరావుకు సత్కారం

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట ఉద్యాన పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్‌బివి.చలపతిరావు ఉద్యోగోన్నతిపై విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీ అయిన అధిపతి చలపతిరావుకు స్థానిక రైతులు, ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, సిబ్బంది పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారున. అనంతరం ఆయన చేసిన పరిశోధనల కోసం చేసిన కృషికి అభినందించారు. సీనియర్ శాస్త్రవేత్త గోవర్ధనరావు ఇన్‌ఛార్జి అధిపతిగా వ్యవహరిస్తున్నారు. నూతన అధిపతిగా మహానంది ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి ఎం.ముత్యాల నాయుడు నియమితులైనారు. ఈనెల 19 న బాధ్యత స్వీకరించనున్నారు.

డిఆర్‌ఒ రాజకుమారి సేవలు ప్రశంసనీయం


డిఆర్‌ఒ రాజకుమారిని సత్కరిస్తున్న డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా తదితరులు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా రెవెన్యూ అధికారి బి.రాజకుమారి సేవలు ప్రశంసనీయమని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్షా ఎపిసి జి.మమ్మీ పేర్కొన్నారు. సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం డిఆర్‌ఒ రాజకుమారికి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ డాక్టర్ సలీం బాషా, ఎపిసి జి.మమ్మీలు మాట్లాడుతూ డిఆర్‌ఒ రాజ కుమారి రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారిగా విధులు నిర్వరిస్తూ విద్యాశాఖకు అందించిన సేవలను ప్రశంసించారు. సమావేశంలో డిసిఇబి సెక్రటరీ బి.హనుమంతురావు, ఉప విద్యాశాకాధికారి పి.రామ లక్ష్మణమూర్తి, సమగ్ర శిక్షా ఎపిఒ డాక్టర్ ఎంఎకె.భీమా రావు, డిఎస్ఒ జివిఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు డిఆర్‌ఒ రాజకుమారి సేవలను ప్రశంసించారు. జూలై నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా విద్యాశాఖ తరపున డాక్టర్ షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు డిఆర్‌ఒ రాజకుమారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యాలయ ఎడి పి.నాగేశ్వరరావు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు బివివి.సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరపరాకు అంతరాయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని అంగర 33/11 కె.వి సబ్ స్టేషన్ లో రెండు కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేయడం పట్ల బుధవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం విద్యుత్ శాఖ ఇఇ కె. రత్నాలరావు ఒక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం , అంగర, టేకి, మాచర మట్టలు, శ్రీరామపురం, వెదురుమూడి, పడమర ఖండ్రిక, కాలేరు, సుభద్రాపురం, నల్లూరు, నేలటూరు, వల్లూరు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు.

పంట కాలువలకు మరమ్మతులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఖరీఫ్‌లో సాగు నీరు సజావుగా సరఫరా చేసేందుకు పంట కాలువల మరమ్మతు పనులు ప్రస్తుత కాలువల మూసివేత సమయంలో జలవనరులు, డ్రెయినేజీ శాఖ ఇంజినీర్ల సమన్వయంతో పూర్తి చేయాలని జెసి టి.నిషాంతి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జలవనరులు, డ్రెయినేజీ విభాగపు ఇంజినీర్లు, గోదావరి హెడ్‌వర్క్స్ ఇంజినీర్లతో సమావేశం జెసి నిర్వహించారు. రుతుపవనాలు వచ్చే లోపు జలవనరులు, విపత్తు నిర్వహణ స్పందన సంస్థ నీటిపారుదల ఆయకట్టు అభివద్ధి శాఖలు మంజూరు చేసిన నిధులతో మరమ్మతు, పూడికతీత పనులకు సంబంధించి సెంట్రల్ డెల్టా, తూర్పు డెల్టా ప్రాంతాలలో పురోగతి ఉన్న పనులు మంజూరు కాబడి టెండర్ దశలో ఉన్న పనులపై జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుపవనాలు వచ్చే లోపుగా డ్రెయినేజీల్లో పూడికతీతలను సమగ్రంగా చేపట్టి పండిన పంటలు ముంపు బారిన పడకుండా మురుగునీరు దిగువకు పారేలా పనులు వేగవంతం చేసి జూన్ మొదటి వారానికి పూర్తి చేయాలని ఆదేశించారు. పూడికతీత పనులను వేగవంతం చేసి జిల్లాలో స్థిరీకరించబడిన పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించా లని ఆదేశించారు. నీటిపారుదల కాలువలు ఇతర నీటి వనరుల నుంచి పేరుకుపోయిన మట్టి, ఇసుక ఇతర అవక్షేపాలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పూడిక తొలగించడం నీటి ప్రవాహం మెరుగుపడి చిట్ట చివరి ఆయకట్టుకు సులభతరంగా సాగునీరు పారి సస్య శ్యామలంగా పంటలు పండుతాయన్నారు. రూ.10 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిన రూ.10 లక్షలు దాటిన పనులను టెండర్ ప్రాతిపదికన పారదర్శకంగా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ రాజకుమారి, గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ కాశి విశ్వేశ్వర రావు, జలవనర్ల శాఖ సెంట్రల్ డివిజన్ ఇఇ బి.శ్రీనివాసరావు, డ్రెయినేజీ విభాగం ఇఇ ఎంవివి.కిశోర్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి టి. నిషాంతి

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు

ప్రజాశక్తి - రామచంద్రపురం

త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని రామచంద్రపురం నియోజవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా యూనిట్, బూత్, క్లస్టర్ ఇన్చార్జిలు మరింత కృషి చేయాలని సూచించారు. గ్రామాలు, వార్డులు స్థాయి నుంచి ప్రజలతో మమేకమవుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. పార్టీ నిర్మాణంలో శ్రమిస్తున్న కార్యకర్తలకు ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కడియాల రాఘవన్, పార్టీ నాయకులు, వాసంశెట్టి సత్యం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై కిశోర బాలికలకు అవగాహన



కె.గంగవరం మండలం ఎర్రపోతవరంలో అవగాహన

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల రక్షన చట్టాలపై కిశోర బాలికలకు అవగాహనా సదస్సులు మంగళవారం నిర్వహించారు.

కె.గంగవరం: బాలిక రక్షణ చట్టాలు పోక్సో చట్టం పైనా అవగాహనా సదస్సును కె.గంగవరం మండలం ఎర్ర పోతవరం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. కిశోర బాలిక వికాసం కార్యక్రమంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. మహిళా పోలీస్ ప్రియాంక మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం పోక్సో చట్టం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైనర్ బాలికలను ఎవరైనా వేధిస్తే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం కనకదుర్గ, అంగన్‌వాడీ టీచర్లు దేవి, సునీత, సుగుణ, ఆశ వర్కర్లు, ఆయాలు, గ్రామంలోని కిశోర బాలికలు పాల్గొన్నారు. **ఆలమూరు :** చెముడులంక పంచాయతీ కార్యాలయంలో బాలల హక్కులు వాటి సంరక్షణ చట్టంపై ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా కిశోరి వికాసం ఆరవ సెషన్ లో పోక్సో చట్టంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిఎంఎస్కేలు బి.శాంతి, సాధనలు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.వరలక్ష్మి దేవిలు మాట్లాడుతూ కిశోరీ బాలికలకు పోక్సో చట్టంపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలల మనుగడ, వారి సంరక్షణ, భాగస్వామ్యం, అభివృద్ధిని, సార్వత్రిక హక్కులను ఆకాంక్షిస్తూ వారు వివరించారు. అలాగే బాలలపై దుర్భాషలు, అఘాయిత్యాలు, నిర్లక్ష్యాలను నిరోధించడానికి చర్యలు ఉంటాయన్నారు. అలాగే సరైన ఆశ్రయం లేని వారికి, పేదలకు, అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నవారికి అండగా చట్టం పనిచేస్తుందన్నారు. బాలల హక్కులలో భాగంగా వారికి పూర్తి ప్రయోజనాలు చేకూరేం దుకుగాను చట్టం చేశారన్నారు.బాలల హక్కుల సంరక్షణకు చట్టబద్ధత కల్పించడం, ఉల్లంఘించే వారిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం వంటివి ఈ చట్ట కర్తవ్యంలో భాగమన్నారు. ఇందులో భాగంగా పుట్టిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు అవసరమ న్నారు. అందుకు శిశువు దగ్గర నుంచి ఐదేళ్ల లోపు బాలల వరకు ప్రతి ఒక్కరికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తప్పకుండా చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు బి.మంగాదేవి, యు.జ్యోత్స్నారాణి, అంగన్వాడీలు యు.సుశీల, కె.సూర్య కుమారి, జి.సత్యవతి, వి.రామలక్ష్మి, కె.జ్యోతి, ఆశాలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** బాల్య వివాహాల వలన కలిగే దుష్ఫలితాలను ప్రజలకు వివరించి బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని స్థానిక సర్పంచ్, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు కోరారు. ఉప్పలగుప్తంలో మంగళవారం సర్పంచ్ చిన్నవరాజు, శిశు సంక్షేమ శాఖ వివిధ శాఖల సమన్వయంతో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అంగన్ వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి అవగాహనా సదస్సు నిర్వహించారు. 11 నుండి 18 ఏళ్ల లోపు బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్,లీలా కుమారి, పి.అనూష, అంగన్ వాడీ టీచర్లు పి.బేబీ, గంగారత్నం, ఎం.మరియమ్మ, ఎం.లలిత కుమారి, డి.రామ సీత తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు పై మండల కేంద్రం స్థానిక లూథరన్ చర్చ్ లో ఐసిడిఎస్ కొత్తపేట సిడిపిఒ ఎ.గజలక్ష్మి ఆదేశాలు మేరకు కిశోర వికాసం కార్యక్రమం సూపర్ వైజర్ హిమశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ హిమశ్రీ మాట్లాడుతూ కౌమార బాలికల సత్ సంబంధాలు, సమస్యలు, పరిపూర్ణ ఆరోగ్యం, పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మ రక్షణ, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. వేసవి శిభిరాల్లో నేర్చుకున్న అంశాలు మీ భావి భారత జీవితంలో ప్రతి అడుగులోను నెమరు వేసుకుంటూ ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



చెముడులంకలో మాట్లాడుతున్న టీమ్ అధికార సభ్యులు



రావులపాలెంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ హిమశ్రీ

మంత్రి నిమ్మలను కలిసిన ఎంఎల్ఏ సత్యనారాయణ

ప్రజాశక్తి - పి.గన్నవరం

నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలకుఎంఎల్ఎ గిడ్డి శాలువా కప్పి సత్కరించారు. నియోజకవర్గానికి చెందిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. 225 మీటర్ల రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి రూ.1.75 కోట్లు ప్రతిపాదనను, హాస్పిటల్ ఛానల్ అభివృద్ధికి సంబంధించి రూ.35 లక్షలు ప్రతిపాదనలు మంత్రికి సమర్పించగా సానుకూలంగా స్పందిస్తూ వాటిని ఆమోదించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. పెండింగ్ లో ఉన్న ఇతర శాంక్షన్ నిధులు త్వరలో మంజూరు చేస్తామన్నారు. మంత్రి స్పందనకు హర్షం వ్యక్తం చేస్తూ ఎంఎల్ఎ ధన్యవాదాలు తెలిపారు.



మంత్రి నిమ్మలను సత్కరించిన ఎంఎల్ఎ గిడ్డి

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఒఎన్‌జిసి, ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాజమండ్రి ఆసెట్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ విఎస్ దివాకర్ కోరారు. సరిపల్లిలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం తహశీల్దార్ దివాకర్ సందర్శించారు.కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో మహిళలకు ఇస్తున్న శిక్షణ వివరాలను ట్రైనర్ మహాలక్ష్మి ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ గెద్దం స్వరూపరాణి,మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్ బాబు తదితరులు ఉన్నారు.



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ దివాకర్

పైప్‌లైన్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి - కాట్రేనికోన

కందికుప్ప ఆర్‌డబ్ల్యూఎస్ తాగు నీటి ప్రాజెక్టుకు సంబంధించిన పైప్లైన్ మరమ్మతు పనులను వేగవంతంగా చేపట్టారు. ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిని తవ్వి పైప్ లైన్ పగిలిన చోట నూతనంగా పైపులైను ఏర్పాటు చేశారు. మంచినీటి ప్రాజెక్టు పరిధిలోని ఆయా గ్రామ ప్రజలు తాగునీరుకు ఇబ్బంది పడకుండగా వెంటనే మరమ్మతు పనులను వేగవంతంగా చేపట్టారు.

నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు ఏలేరు కాలువలో మంగళవారం ఈతకు దిగారు. వీరిలో ఇద్దరు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఒడ్డును ఉన్న ఇతర విద్యార్థులు కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న రైతులు సత్యనారాయణ, సిద్దు నీటిలో కొట్టుకుపోతున్న కాకినాడ సిరి అనే కుర్రాడిని రక్షించారు. గ్రామానికి చెందిన పంది వీర వెంకట సత్యనారాయణ కాలువలో గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం ఫైర్ సిబ్బంది, పోలీస్ అధికారులు స్థానికులు గాలింపు చేపట్టారు. ఈ ప్రమాదంలో బయటపడ్డ యువకుడికి ఏలేశ్వరంలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏలేరు కాలువ నీటి ఉధృతిని తగ్గించి గల్లంతైన యువకుడి ఆచూకి తెలుసుకోవాలని సూచించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.92,050లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు. అలాగే జి.రాగంపేట గ్రామంలో నిర్వహించిన పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.72,560 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు చోట్ల జరిగిన దాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గొల్లప్రోలులో...

మండలంలోని కొడవలి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొత్తపల్లిలో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లిలో గడ్డివామి దగ్ధమైన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపల్లి నుంచి సుబ్బంపేట వెళ్లే దారిలో వాకతిప్ప గ్రామానికి చెందిన లొల్ల వీర వెంకట సత్యనారాయణ పొలాన్ని జాను అనే వ్యక్తి కౌలుకి తీసుకోగా 8 ఎకరాల్లో కోతల కోసి వచ్చిన గడ్డిని భద్రపరచుకున్నాడు. ఐదు లక్షల విలువచేసే గడ్డి మేటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గడ్డిమేటు దగ్ధం కావడంతో కౌలు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మంగళవారం మండలంలోని తాటిపర్తి గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి ఒక కోడి పుంజు, రూ.8020 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రెండు గ్రావెల్ లారీలు సీజ్

ప్రజాశక్తి - సీతానగరం

నల్లగొండ, కోటి కేశవరం గ్రామాల పరిధిలోని గ్రావెల్ కొండల నుండి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి రెడ్డి సుబ్రమణ్యం అనే వ్యక్తి లారీల ద్వారా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సీతానగరం ఎస్ఐ డి.రామకుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు లారీలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై సీతానగరం ఎస్ఐ రామకుమార్ మాట్లాడుతూ పట్టుబడిన గ్రావెల్ లారీల వివరాలను మైనింగ్ శాఖ అధికారులకు తెలియజేశామని చెప్పారు. మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఆ లారీలకు తగిన జరిమానా విధిస్తామన్నారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ మరియు ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంక ఇసుక తెన్నెల్లో మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అమలాపురం అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు, సిఐ కె.కాత్యాయిని ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇసుక తిన్నెల్లో నాటు సారా తయారు చేయడానికి నిల్వ ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ తెలిపారు.

పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - రావులపాలెం

సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా ఎపిఎస్ ఆర్‌టిసి రావులపాలెం డిపో నుంచి ఈనెల 15న రెండు ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు డిపో మేనేజర్ జిజివి.రమణ తెలిపారు. వివరాలకు, అడ్వాన్స్ టికెట్ల కోసం డిపో మేనేజర్ - 9959225537, అసిస్టెంట్ మేనేజర్ - 7382911871, బస్ స్టేషన్ ఎంక్వైరీ - 9959225549 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

వినియోగదారుల చట్టాలపై అవగహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల లోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని డిఎస్ఒ కార్యాలయం లో మంగళవారం డిఎస్ఒ ఉదయ భాస్కర్ అధ్యక్షతన వినియోగదారుల హక్కులచట్టం పై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ పలు అంశాలపై ప్రసంగించారు. కోకోఫెడ్ జిల్లా అధ్యక్షులు అరిగెల బలరామమూర్తి, ప్రధాన కార్యదర్శి ఆదిత్య కిరణ్ మాట్లాడుతూ వినియోగదారుల చైతన్యానికి నెలకు ఒక కార్యక్రమం చొప్పున నిర్వహిస్తామన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

వెంకన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని మంగళవారం అమరావతి హై కోర్ట్ న్యాయమూర్తి ఎం.కిరణ్మయి, వారి సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు, వారికి స్వామివారి దర్శనం అనంతరం తీర్ధ ప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.2 లక్షల విరాళాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. మంగళవారం తుని కి చెందిన ధనలక్ష్మి జ్యూయలర్స్, దాడిశెట్టి విష్ణుచక్రం, రామజ్యోతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.2.20 లక్షల ఆలయ డిసి నల్లం సూర్య చక్ర ధర రావుకు అందజేశారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం సన్నిధిలో ఉన్న గోశాలకు మామిడికుదురు మండలం పెదపట్నం సర్పంచ్ గుబ్బల దుర్గ, పండు దంపతులు గోశాల నందు ఉన్న గోవులకు ఒక ట్రాక్టర్ గడ్డిని మంగళవారం అందజేశారు. అదే విధంగా పి.గన్నవరం మండలం మండలం కె.ఏనుగుపల్లి మాజీ సర్పెంచ్ సూదా వీరభద్ర రావు మనవలు ఆయుష్, అయాన్స్ గోశాల నందు ఉన్న గోవులకు ఒక ట్రాక్టర్ గడ్డిని అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు



అందజేసిన పెదపట్నం సర్పంచ్ దంపతులు

అందుబాటులో హోమియో ఆసుపత్రి సేవలు

ప్రజాశక్తి - ఆలమూరు

గడచిన కొన్నేళ్లుగా వైద్యుల కొరతతో మూతబడిన మండలంలోని జొన్నాడ హోమియోపతి వైద్యశాలకు ఎట్టకేలకు వైద్యుల నియామకంతో తిరిగి సేవలు ప్రారంభమయ్యాయి. హోమియోపతి మందుకు అలవాటు పడిన రోగుల అవస్థలు చూడలేక జొన్నాడకు చెందిన తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను) స్పందించి ఈ ఆసుపత్రికి వైద్యులను నియమించాలంటూ నియోజకవర్గ పెద్దలతో జరిపిన చర్చలు ఫలించడంతో ఈ ఆసుపత్రికి డాక్టర్ మిథున్ (ఎండి), డాక్టర్ రవి రాజశేఖర్ (ఎండి) అనే ఇద్దరు వైద్యులను నియమించారు. దీంతో ప్రజలకు హోమియోపతి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. కాగా ఈ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందించేందుకు తాడి శ్రీనివాసరెడ్డి సుమారు రూ.10 వేల సహాయంతో మందులను కొనుగోలు చేసి, ఆసుపత్రి వైద్యులకు మంగళవారం అందించారు. దీంతో హోమియోపతి వైద్యాన్ని జొన్నాడతో పాటుగా పరిసర గ్రామ ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శిల్పికి విగ్రహాల నమూనా అందజేత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక బుద్ధ పార్కులో ఏర్పాటు చేయనున్న మహాత్మ పూలే, బాబు జగ్జీజీవన్ రామ్ విగ్రహాల నమూనాను శిల్పి మాధవరావుకు ఎంఆర్ పిఎస్ నాయకులు మంగళవారం అందజేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహంతో పాటు జగ్జీవన్ రామ్ విగ్రహస్థానే కొత్త విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన నమూనా చిత్రపటాన్ని శిల్పికి అందించారు. ఎంఆర్ పిఎస్ నాయకుడు ఖండవిల్లి ఏలీయా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎంఎల్ఏ దాట్ల సుబ్బరాజు ఇచ్చిన హామీల్లో భాగంగా మహాత్మ పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 19న కాకినాడ జిల్లాలో జరిగే కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతంగా చేయాలనీ ఏలీయా కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవ మూర్తి, విధి చిరంజీవి, చెట్ల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎపిసిగా మమ్మీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా జి.మమ్మీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఎపిసిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఎపిసిగా మమ్మీని నియమిస్తూ సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఎపిసిగా మమ్మీ బాధ్య తలు స్వీకరించిన అనంతరం మంగళవారం ఆమె జెసి టి.నిషాంతి, డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎపిసి జి.మమ్మీ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వ ర్యంలో జరుగుతున్న పథకాలను సమర్ధవంతం గా నిర్వహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.



జెసి నిషాంతిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎపిసి జి.మమ్మీ

పాస్‌పోర్ట్ పడిపోయినది

బీర విశ్వ శాంతి, భర్త: చిన బాబు, అనాతవరం, దంగేటివారి పాలెం వాసిని. ది 10-05-2025న నేను నా **పాస్‌పోర్ట్ నెం. ఎన్ 2887841** గల పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి ఆటోలో ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. వెంటనే ఈ పాస్‌పోర్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.

బీర విశ్వ శాంతి, భర్త: చినబాబు,
డోర్ నెం.9-28, దంగేటివారిపాలెం,
అనాతవరం, ముమ్మిడివరం మండలం,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ నెం.91774 43468

సైనికుడు మురళీ నాయక్ మరణం బాధాకరం

ప్రజాశక్తి - పి.గన్నవరం

పాక్ దాడిలో ఎపిలోని సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు ఎం.మురళీ నాయక్ మరణం బాధాకరమని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. మురళీనాయక్ కుటుంబానికి ఎంఎల్ గిడ్డి సత్యనారాయణ మంగళవారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15 న జరగాల్సిన ఆయన పుట్టినరోజు వేడుకను నిర్వహించకుండా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. కూటమి నాయకులు ఎలాంటి శుభాకాంక్షలు, కార్యక్రమాలు చేపట్టకుండా ఈ త్యాగాలను గౌరవించ గలిగే విధంగా శాంతంగా ఉండాలని కోరారు.

కబేళా సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలో 40 ఏళ్లుగా ఉన్న కబేళా సమస్యను పరిష్కరించాలని భారత చైతన్య యువజన సంఘం పార్టీ నాయకులు బర్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కబేళాను వేరే చోటకి తరలించాలని కోరుతూ పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో కొందరు తనను బెదిరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కబేళాను తొలగించాలని, రామచంద్రపురం చోడవరం పట్టణ ప్రజలు ప్రయాణికులు పలుమార్లు విజ్ఞప్తి చేసిన ఇది కొనసాగుతూనే ఉందన్నారు. దీనిని వేరే చోటకి తరలించాలని తాము కూడా విజ్ఞప్తి చేశామన్నారు. బెదిరింపులకు తాను భయపడనని ప్రజా సమస్య పరిష్కారానికి ఎప్పుడూ పోరాటం కొనసాగిస్తూనే ఉంటానన్నారు. కబేళాపైఆధారపడుతున్న వ్యాపారులు, వ్యక్తులు దీనిని వేరే చోటకు తరలించి తమ జీవనోపాధి కొనసాగించాలని ఆయన తెలియజేశారు.

శివప్రసాద్‌కు నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ జాగాబత్తిన శివప్రసాద్ ఆంధ్ర ప్రదేశ్ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితుల య్యారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌ను మంగళవారం విజయవాడలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బండారులంక గ్రామానికి చెందిన ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆధ్వర్యంలో దేవాంగ పెద్దలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు, మాజీ పెడన మున్సిపల్ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సమైక్య అధ్యక్షులు బండారు ఆనందప్రసాద్, నర్సాపురం పార్లమెంటు దేవాంగ బిసి సాధికారిక సమితి కన్వీనర్ రోబ్బి భాస్కరరావు, పద్వీ, రవి తదితరులు ఉన్నారు.

కాకినాడ నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 225/2025-జి-1 | తేది.13-05-2025

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ దిగువ తెలిపిన మాస్టర్ ప్లాను రోడ్లు అనగా 1. పావురాల తూము నుండి ఉప్పరిపేట రోడ్డు, 2. JNTUK స్టేడియం రోడ్డు, 3. గ్రంధి కళ్యాణ మండపం రోడ్డు, సిదార్ధ నగర్, 4. సాంబమూర్తి నగర్ 5వ వీధి, 5. సూర్యరావుపేట, బీచ్ రోడ్డు దగ్గర, త్యాగరాజు నగర్, 6. మెయిన్ రోడ్డు (or) సుభాష్ రోడ్డు, 7. మెహర్ నగర్ రోడ్డు, 8. యేసు వారి వీధి, జగన్నాధపురం నందు భవిష్యతులో అభివృద్ధి చేయవలసిన రోడ్లు నిమిత్తము ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలములు అవసరమై యున్నందున ఆయా వ్యక్తులు ముందుకు వచ్చి పై తెలిపిన రోడ్లు విస్తరణలో పోవుచున్న స్థలములను నగరపాలక సంస్థకి స్వాధీనపరచుటకు తద్వారా వారికి ప్రత్యామ్నాయంగా నష్టపరిహారమునకు బదులుగా Transferable Development Right Certificate (TDRC) నకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనియున్నారు.

ఇందుపై ప్రస్తుతము అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms. No. 119 MA&UD, Dept Dt. 28-03-2017, G.O.Ms. No. 180, MA&UD, Dept. 01-10-2020 మరియు తదుపరి ఉత్తర్వులు G.O.Ms. No. 4, MA&UD, Dept. 09-01-2025 లను అనుసరించి రోడ్డు విస్తరణకు కావలసిన స్థలమును స్వాధీనపరచుకుని Transferable Development Right Certificate (TDRC) జారీ చేయుటకు అవకాశము కల్పించబడినది. మరియు సదరు Transferable Development Right Certificate జారీ చేయుటకు సదరు దరఖాస్తులను సవివరముగా పరిశీలించి ఈ క్రింది తెలుపబడిన దరఖాస్తుదారులకు Transferable Development Right Certificate ల కొరకు TDR కమిటీ వారి నిర్ణయముకు లోబడి జారీ చేయబడునని తెలియచేయడమైనది.

S. No.	Name of the Applicant	Location of the Site Affected	Survey Number	Extent Affected in Road Widening as per Master Plan/ Area Development Plan in (Sq.m)	Master Plan Road/ Area Deveopment Plan Road / Connecting Road	Application Number/ date	Urban/ Rural	Remarks
1	Sagarapu Nookalamma / 012582	Pavuralathum to Uppari peta Road	237/4 Part	153.28	Master Plan	12582	Urban	
2	Gampu Veera Venkata Ramana / 010440	Stadium Road Gollala Street	88/3-2	48.16	Master Plan	10440	Urban	
3	1. Degala Suresh Kumar, 2. Degala Venkata Ramanamma, 3. Degala Ram Mohan Raja 4. P.N.V.V.S.Jayalakshmi Kumari, 5. Koppireddy Prameela Rani, 6. Vadupu Sridevi / 013131	Grandhi Kalyana Mandapam Road, Siddardha Nagar	121/1	55.49	Master Plan	13131	Urban	
4	Kotipalli Satyadevi / 002046	Sambamurthy Nagar 5th Street	136/4P ART	20.61	Master Plan	2046	Urban	
5	Patneedi Suryanarayana / 011894	Suryaraopeta Near Beach Road, Thya garaju Nagar	255/1C	109.67	Master Plan	11894	Urban	
6	Patneedi Bhavya Prathyusha / 011887	Suryaraopeta Near Beach Road, Thya garaju Nagar	255/1C	868.24	Master Plan	11887	Urban	
7	Patneedi Manoja Sreelakshmi Seetha Anusha / 011889	Suryaraopeta Near Beach Road	255/1C	433.48	Master Plan	11889	Urban	
8	Burra Veera Venkata Satyanarayana/ 011758	Meher nagar Road	209/3P	29.58	Master Plan	11758	Urban	
9	Allam Veera Venkata Malikarjuna Rao / 006379	Yesuvaristreet Jagannadhapu ram Main Road	851/1 & 839/4	71.46	Master Plan	6379	Urban	
10	Appana Kamaraju / 013770	Main (Subash) Road	987	87.07	Master Plan	13770	Urban	

పైన తెలిపిన దరఖాస్తుల విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 07 రోజులలోగా ఈ క్రింది సంతకము దారునకు లిఖిత పూర్వకముగా ఆఫీసు పని వేళలలో అందజేయవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనరు,** కాకినాడ నగరపాలక సంస్థ